క్లుప్తంగా

ప్రతిభకు అభినందన



పిట్లం(జుక్కల్): ఇటీవల సెర్బియాలో జరిగిన ప్రపంచ స్థాయి చెస్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో వెండి పతకం సాధించిన పిట్లం వాసి ప్రతిభ శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగోసారి ప్రపంచ స్థాయి చెస్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ సాధించినందుకు ప్రతిభను చిన్నారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శాలువాతో సన్మానించి దీపావళి కానుకను బహుకరించారు. 23వ అంతర్జాతీయ పతకం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేశ్



కామారెడ్డి అర్బన్: తెలంగాణ మున్నూరుకాపు సంఘం వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బీబీపేట మండలం కోనాపూర్‌కు చెందిన ఎం రాజేశ్‌ను నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తమరావు పటేల్ ఆదేశాల మేరకు అపెక్స్ కమిటీ సభ్యులు మామిండ్ల అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి నీలం నర్సింలు ఈ మేరకు రాజేష్‌కు నియామకపత్రం అందజేశారు. నాయకులు జి.భాస్కర్, ఎం.భీమేష్, లింగం, ముల్కరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి ఎస్సైగా నరేశ్



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ఎస్సైగా నరేశ్ శుక్రవారం పదవీ బాధ్యతలను తీసుకున్నారు. తాడ్వాయి ఎస్సైగా గతంలో పనిచేసిన మురళి బదిలీపై కామారెడ్డికి వెళ్లడంతో కామారెడ్డిలో ఎస్సైగా పనిచేసిన నరేష్ బదిలీపై తాడ్వాయికి వచ్చారు.

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి



ఎల్లారెడ్డి: ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని ఆర్‌ఎంఆ కాశీరాం అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో ఆర్టీసీ కార్గో సేవలను ఆయన ప్రారంభించారు. ఆర్టీసీ కార్గో ద్వారా సత్వరం సేవలు అందుతున్నాయని అన్నారు. డీఎంఆ కిషోర్, మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మ శ్రీకాంత్, నిర్వాహకులు విద్యాసాగర్ తదితరులున్నారు.

మహిళలు చైతన్యంతో ఉండాలి



కామారెడ్డి అర్బన్: ప్రతి హిందువు ఉమ్మడి కుటుంబంతో పర్యావరణహిత జీవన విధానం పాటించాలని, మహిళలు చైతన్యంతో ఉండాలని రాష్ట్రీయ సేవికా సమితి నగర బౌద్ధిక్ ప్రముఖ్ బొంతపల్లి కల్పన, నందికంటి శ్రీలతలు అన్నారు. సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి సరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో జిల్లా అధ్యక్షురాలు గుజరాతీ సరోజ అధ్యక్షతన సప్త శక్తి సంగం మాతృ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. గుజరాతీ సరోజ అధ్యక్ష భాషణం చేశారు. మహిళల ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి రమేష్ అన్నారు. కన్‌కల్‌లో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆవులు, గేదెలకు టీకాలను వేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు కిష్టారెడ్డి, కార్యదర్శి సాయిరెడ్డి, వైద్య సిబ్బంది పోచయ్య, కొండల్‌రెడ్డి, ప్రేమ్ సింగ్, గోపాల మిత్ర మహిపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

- అనుమతి కొంత.. నిర్మాణాలు మరికొంత
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు



పిట్లం ముఖచిత్రం

పిట్లం(జుక్కల్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పిట్లం మీదుగా నాలుగు లేన్ల జాతీయ రహదారి పోవడంతో పిట్లం మండల కేంద్రం దినదినాభివృద్ధి చెందుతోంది. వ్యాపార వాణిజ్య సముదాయాలు అధికంగా ఉండటంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు సంగారెడ్డి జిల్లాకు చేరువగా ఉండటంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు పిట్లం పట్టణంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో కంటే నిర్మాణాలు ఒక్క సారిగా పెరిగిపోయాయి. గతంలో సంవత్సరానికి 100 ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండేవి. ప్రస్తుతం సంవత్సరానికి సుమారుగా 300 వందల పైబడి ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి.

జీ ప్లస్ 2 వరకు మాత్రమే అనుమతి..

పిట్లం మేజర్ పంచాయతీ అయినందున ఇక్కడ జీ ప్లస్ 2 వరకు మాత్రమే అనుమతి ఉంది. అయితే ఇవేమి లెక్క చేయని ప్రజలు జీ ప్లస్ 3తో పాటు కొన్ని చోట్ల పెంట్‌హౌస్‌లు నిర్మిస్తున్నారు. అంతేగాకుండ సెల్లార్‌లకు అనుమతి లేకున్నా ఇష్టానురాజ్యంగా నిర్మిస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని దుకాణ సముదాయాలు నిర్మిస్తున్నారు. మరి ఇళ్ల నిర్మాణ అనుమతులు ఇచ్చిన అధికారులు తర్వాత నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయని పరిశీలించకపోవడంతో యజమానులు వారి ఇష్టం వచ్చిన విధంగా నిర్మించుకుంటున్నారు. అధికారులు నిత్యం తిరిగే ప్రధాన రహదారుల పక్కనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. జీ ప్లస్ 2 కాకుండా సెట్ బ్యాక్ కూడా తీసుకోకుండ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అనుమతి లేదు



పిట్లం పంచాయతీలో ఇండ్ల నిర్మాణానికి జీ ప్లస్ 2 వరకు మాత్రమే నిర్మాణం చేయాలి. సెల్లార్ నిర్మాణాలకు కూడా అనుమతి లేదు. ఎవరైనా దీనికి అతిక్రమించి ఇండ్ల నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాల వివరాలు సేకరించి పనులు నిలిపి వేస్తం. పై అధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– రఘు, మండల ప్రత్యేక అధికారి, పిట్లం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



సజ్యానాయక్ తండాలో లబ్ధిదారుకు మంజూరుపత్రాన్ని అందజేస్తున్న ప్రత్యేక అధికారి సతీశ్ యాదవ్



ఆర్గొండలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలక్రిష్ణ



బోర్లంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



నల్లమడుగులో అవగాహన కల్పిస్తున్న ఎంపీవో

సాక్షి నెట్‌వర్క్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. శుక్రవారం జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ బిల్లులను విడతల వారీగా మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఇంకా నిర్మాణం ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించాలని సూచించారు. సదాశివనగర్ మండలం సజ్యానాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ ప్రారంభించారు. రాజంపేట మండలం ఆర్గొండ, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, శేర్ శంకర్ తండా గ్రామాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో బాలకృష్ణ పరిశీలించారు.

రైతులకు ఉచితంగా ఎరువులు, విత్తనాలివ్వాలి



మాట్లాడుతున్న అంతంపల్లి విండో చైర్మన్ వలకొండ వెంకట్‌రెడ్డి

భిక్కనూరు: భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా పంటలు నష్టపోయారని, వారందరికి ప్రభుత్వం యాసంగిలో ఉచితంగా ఎరువులు విత్తనాలు ఇవ్వాలని అంతంపల్లి విండో 60వ మహాజన సభలో రైతులు తీర్మానించారు. శుక్రవారం అంతంపల్లిలో జరిగిన సింగిల్ విండో మహాజన సభకు చైర్మన్ వలకొండ వెంకట్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని రైతులందరికి వర్తింపజేయాలన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు ఎంత మేరకు ఎరువులు అవసరమో ప్రభుత్వమే సర్వే చేసి సరిపడా ఎరువులను సరఫరా చేయాలన్నారు. అలాగే సన్నరకం వరికి రూ.500 బోనస్‌ను వెంటనే చెల్లించాలని రైతులు తీర్మానించారు. విండో వైస్ చైర్మన్ ఏనుగు రాజిరెడ్డి, మానిటరింగ్ అధికారి సురేష్ కుమార్, విండో సీఈవో శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కిషన్‌రావు, మాజీ చైర్మన్ ఏనుగు రాంరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

రామారెడ్డి: ఉపాధి హామీ సామాజిక తనిఖీలలో అవకతవకలు బయటపడ్డాయి. శుక్రవారం రామారెడ్డి మండలంలోని రైతు వేదికలో 4వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు .ఈ సందర్భంగా ఉపాధి పనులకు సంబంధించిన గ్రామాల నివేదిక చదివి వినిపించారు. రామారెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ రజిత వంద రోజులు పూర్తి అయిన కూలీలతో 56 రోజులు అదనంగా పని చేయడాన్ని గుర్తించారు. దానికి సంబంధించి 26 మందికి రూ.22 వేల కూలీ రాదని తెలిసి ఎందుకు పనులు చేయించారని అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు ఫీల్డ్ అసిస్టెంట్ రజిత, ఏపీవో ధర్మారెడ్డిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరాయిపల్లిలో పలు పనుల్లో అవకతవకలు బయటపడ్డాయి. ఒకే ఇంట్లో 3 జాబ్ కార్డులను గుర్తించారు. ఎంపీడీవో నాగేశ్వర్‌రావు, ఎంపీవో తిరుపతిరెడ్డి, క్వ్యాసి రాఘవన్, ఎస్‌టీఎం సాయి జ్ఞానేందర్, ఎంపీవో ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు



కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను తీసుకొస్తున్నారని విమర్శించారు. అన్ని రంగాల్లో కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీసం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. హక్కులను సాధించుకోడానికి కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, కార్యదర్శి పసుల బాలరాజ్, గౌరవ అధ్యక్షుడు ఎల్.దశరథ్, నాయకులు రఫీక్, శ్రీనివాస్, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తులతో జాగ్రత్త..!



తాడ్వాయి(ఎల్లారెడ్డి:) సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి సుప్రజ అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, రోడ్డుభద్రత, మైనర్ డ్రైవింగ్, బాల్య వివాహాలు తదతర అంశాల గురించి వివరించారు. మత్తు పదార్థాలు వాడవద్దని, క్రమశిక్షణతో చదువుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని బాగా చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ యూసుఫ్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి శ్రీకాంత్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి: సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు శుక్రవారం తహసీల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. న్యాయమూర్తిపై దాడికి యత్నించిన వారిపై ఇంత వరకు కేసు నమోదు చేయకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు పద్మారావు, శివానందం, సామెల్ తదితరులున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు డాక్టర్ సవిత ఫిజియోథెరపి చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు దివ్యాంగులకు పరీక్షలు చేసి వ్యాయామం చేయించారు. అలాగే చిన్నారుల తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఐఈఆర్‌పీ అశ్విని, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం శుక్రవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఐఈఆర్‌పీ కమల్ కిషోర్, వైద్యురాలు సారిక, వికలాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది



మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సీపీఆర్ విధానంపై 108 సిబ్బంది అవగాహన కల్పించారు. గుండెపోటు, లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉన్న సమయంలో కృత్రిమ శ్వాస అందించడానికి ఛాతీ నొక్కాలని సూచించారు. దీని వల్ల బాధితుడికి శ్వాస అందించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో ప్రతి క్షణం విలువైనదన్నారు. ఆలస్యం చేయకుండా వెంటనే సీపీఆర్ పద్ధతిని పాటించి ప్రాణాలు కాపాడాలన్నారు. 108 పైలట్ శ్రీనివాస్, ఈఎంటీ కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం 108 సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నరేష్ మాట్లాడుతూ.. గుండె పోటు,ఊపిరి ఆగిపోయిన వారికి కృతిమ శ్వాస అందించేందుకు సీపీఆర్ దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ యాకినొద్దిన్, అధ్యాపకులు నర్సింలు, శ్రీనివాస్, 108 సిబ్బంది ప్రణీత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల భవనమా..? గోదామా..?



పెద్దకొడప్‌గల్(జుక్కల్): సర్దార్ తండా ప్రాథమిక పాఠశాల భవనాన్ని కొందరు తండావాసులు గోదాముగా మార్చుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాఠశాలకు రెండు భవనాలు ఉండగా అందులో ఒకటి ఉపయోగించకపోవడంతో దాని ఆసరాగా చేసుకొని కొందరు తండా వాసులు ఆ భవనంలో సోయాలు పోసి గోదాంగా మార్చుకున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాల భవనాన్ని గోదాముగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధాన్యం సేకరణ ప్రారంభం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ధర్మారెడ్డి గ్రామంలో మహిళాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో శుక్రవారం ధాన్యం సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన సేకరించేందుకు తమ సిబ్బంది పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సీసీ దత్తు, మహిళాసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కామారెడ్డి అర్బన్/సదాశివనగర్: జిల్లాలో వెంటనే వరి, మక్క, సోయాబీన్, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి క్లస్టర్ల వారీగా రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పైడి విఠల్‌రెడ్డి, ఆర్ల శంకర్‌రావులు శుక్రవారం అదనపు కలెక్టర్(రెవెన్యూ) విక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో అతివృష్టితో పంటలు నష్టపోయి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చేతికి వచ్చిన పంట నష్టపోకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో 18 చోట్ల మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, అవసరమైన చోట ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. తొందర పడి దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించవద్దన్నారు. నాయకులు సాయిలు, కొమిరెడ్డి అంజన్న, రావుసాబ్, మనోజ్ రెడ్డి, లక్కాకుల భాస్కర్ పాల్గొన్నారు.

హమాలీల తప్పిదంతోనే తూకంలో తేడాలు



కాంటా వద్ద మాట్లాడుతున్న రైతులు

భిక్కనూరు: హమాలీల తప్పిదం, తొందరపాటు పనుల వల్లనే మొక్కజొన్న తూకంలో తేడాలు వచ్చాయని గుర్జకుంట గ్రామానికి చెందిన రైతులు ఆరోపించారు. శుక్రవారం వారు మొక్కజొన్నలను గాంధారి ప్రాంతానికి చెందిన వ్యాపారులకు విక్రయిస్తూ మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల తాము గాంధారి ప్రాంత వ్యాపారులకు మొక్కజొన్నలను విక్రయిస్తున్నామన్నారు. గురువారం హమాలీలు కొందరూ తొందరపాటు తప్పిదం వల్లనే కాంటాలో తేడాలు కనిపించిందని దీన్ని మరోసారి తనిఖీ చేసుందుకు తాము యత్నిస్తుండగా వ్యాపారులు తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రతి ఏడాది మొక్కజొన్న, పత్తి పంటను గాంధారి ప్రాంతానికి చెందిన గిరిజన వ్యాపారులకే విక్రయిస్తున్నామని వారు తమకు సకాలంలో డబ్బులు చెల్లిస్తున్నారని అన్నారు. హమాలీలు తాము చేసిన తొందరపాటు పనులకు క్షమాపణలు చెప్పారని రైతులు వివరించారు.

రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి



రక్తదానం చేస్తున్న యువకుడు శ్రీధర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో రక్తదానం చేసిన మైనార్టీ యువకులకు ఆర్డీవో పార్థసింహారెడ్డి శుక్రవారం సర్టిఫికెట్లు అందించారు. రెడ్‌క్రాస్ సంస్థ తరఫున మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో భాగంగా రక్తదానం చేసిన మైనార్టీ యువకులను ఆర్డీవో అభినందించారు. మైనార్టీ నాయకులు గయాజుద్దీన్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి జోషి శ్రీధర్ తదితరులున్నారు.

చిన్నారికి రక్తదానం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన చిన్నారి అర్షియా రక్త హీనతతో బాధపడుతుండడం.. ఆమెకు బీ–నెగెటివ్ రక్తం అవసరం ఉండడంతో కామారెడ్డికి చెందిన శ్రీధర్ రక్తదానం చేసి చిన్నారికి సహాయం చేసినట్లు కామారెడ్డి బ్లడ్ సెంటర్ నిర్వాహకులు వెంకటరమణ శుక్రవారం తెలిపారు. రక్తదానం చేసిన శ్రీధర్‌కు చిన్నారి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయడం ఆనందంగా ఉందని శ్రీధర్ తెలిపారు.

సంక్షిప్తం

ఉపాధి హామీ ప్రజావేదిక

మాచారెడ్డి: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ ప్రజావేదికను శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపిబాబు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉపాధి హామీ కూలీలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు దాతల విరాళం

దోమకొండ: మండల కేంద్రంలోని శివరామమందిర్ ఆలయంలో ఈనెల 24 నుంచి రెండు రోజుల పాటు జరిగే ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు గ్రామానికి చెందిన పలువురు దాతలు విరాళాలు అందించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ అంజయ్య తెలిపారు. మాజీ సర్పంచ్ ఐరేని నర్సయ్య రూ.21,116, పన్యాల ముత్యంరెడ్డి రూ.25,116, అందించారన్నారు. వీరితో పాటు గ్రామానికి చెందిన హనుమంత్ రెడ్డి, బొమ్మెర శ్రీను, కానుగంటి శారద, కర్రొల్ల లక్ష్మీరామాగౌడ్, సాయబుగారి రాజు, మేస్త్రీ శంకర్, ఇంద్రసేనారెడ్డి, సిద్దరాములు, నారాయణరెడ్డి, సంతోష్, వెంకటేశం, గజవాడ శ్రీకాంత్, నల్లపు శ్రీను, ప్రశాంత్, ప్రతాప్‌రెడ్డి, విఠల్ రెడ్డి తదితరులు రూ.5వేల చొప్పున విరాళం అందజేసినట్లు ఆయన వివరించారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏక్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దం రాజు(సదాశివనగర్), ప్రధాన కార్యదర్శిగా క్రాంతి(మర్కల్), కోశాధికారిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా శేఖర్, గౌరవ అధ్యక్షుడిగా దుబ్బాక ఆశన్న, గౌరవ సలహాదారుడిగా ఉమాశేఖర్, కుటుంబ భరోసా ఇన్‌చార్జిగా శ్రీనులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బద్దం రాజు మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఇస్రో సందర్శనకు పేట్‌సంగెం విద్యార్థిని ఎంపిక





ఎంపికైన విద్యార్థిని శరణ్య

బీబీపేట/గాంధారి: ఇస్రో సందర్శనకు మండల పరిధిలోని పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని జి.శరణ్యతో పాటు బీబీపేట మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని రేవతి ఎంపికైనట్లు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. స్పేస్ సైన్స్ టాలెంట్ టెస్టు కోసం నిర్వహించిన పరీక్షలో శరణ్య, రేవతి మంచి ప్రతిభ కనబర్చారన్నారు. దీంతో వారిని ఇస్రో సందర్శనకు అధికారులు ఎంపిక చేశారన్నారు.